## 16న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, డిసెంబర్ 14 : నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిరేకల్ సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.00 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## 18న నల్లగొండ మున్సిపల్ సర్వసభ్య సమావేశం

నీలగిరి, డిసెంబర్14 : నల్లగొండ మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు సకాలంలో అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

# ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 14 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, ఓనర్లు,ఆటో డ్రైవర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని బీఆర్‌టీయూ ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ నాజర్ అలీ మీర్జా, నియోజకవర్గ అధ్యక్షుడు కలగోని యాదయ్య గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో పది రోజులుగా 90 శాతం మహిళలలు బస్సులో ప్రయాణిస్తారని, ఆటోల్లో ఎక్కే వారు లేకుండా పోయారని వాపోయారు. దాంతో ఆటో డ్రైవర్ల కుటుంబ పోషణ భారమైందని ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగం కార్మికులకు జీవనభృతి కింద నెలకు రూ.15 వేలు అందజేయాలన్నారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నరేందర్, రమేశ్, సుదర్శన్, జహంగీర్ , ఈదుల వెంకన్న, బాబా సైదులు, శ్రీను, శంకర్, వజ్రయ్య, హుస్సేన్, సైదులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి : కలెక్టర్

సూర్యాపేట, డిసెంబర్ 14 : మండల, గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగుల పనితీరు మెరుగు పడాలని లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి వెబ్‌ఎక్స్ ద్వారా జిల్లా, మండల అధికారులతో జిల్లా అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల నివేదికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, ఎంపీఓలు, ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బంది పనితీరు సరిగ్గా లేదన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం నిర్వహణ లేమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో పలుచోట్ల పిల్లలకు కోడిగుడ్డు అందడం లేదన్నారు. సంపద వనాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామాల్లో శానిటేషన్ సైతం సరిగ్గా లేదని ప్రత్యేక అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే పనితీరును మార్చుకోవాలని సూచించారు. పనితీరు మారని అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### 31 నాటికి సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి..

మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, తాసీల్దార్లు జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేయగా సీఎంఆర్ చేయని 5 మిల్లులను గుర్తించినట్లు చెప్పారు. ఈ నెల 31 నాటికి లక్ష్యం పూర్తి చేయని రైస్ మిల్లులపై క్రిమినల్ చర్యలు పెట్టి చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ మోహన్‌బాబుకు సూచించారు. 23 మండలాల్లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని చెప్పారు.

# గంజాయి నిరోధానికి స్పెషల్ టీమ్స్ : ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 14 : గంజాయి వినియోగదారులను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు అలాగే జిల్లాలో గంజాయి నిరోధానికి స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువకులు ఎవరైనా గంజాయికి అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏడాది కాలంగా గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ జిల్లా పోలీస్ శాఖ 650 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 25 కేసులు నమోదు చేసి 59 మందిని అరెస్ట్ చేయడం జరిగిందని అందులో ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

# క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

- తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి


మాట్లాడుతున్న జడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి, డిసెంబర్ 14 : క్రైస్తవుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మండలంలోని మల్లేపల్లివారిగూడెంలో బేతనియ క్రిస్టియన్ మినిస్ట్రిస్ చర్చిలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. క్రిస్టియన్ల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడంతోపాటు వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకురాలు పాస్టర్ ప్రీతి ప్రశాంత్, మాజీ సర్పంచులు చింత కుంట్ల రవీందర్‌రెడ్డి, జాకటి మోష, పాస్టర్లు కత్తి డేవిడ్ రాజు, ఎం.రవికుమార్, యేసయ్య, లాజరస్, తిమోతి పాల్గొన్నారు.

## 17న విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

రామగిరి, డిసెంబర్ 14 : విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోని విశ్వబ్రాహ్మణులంతా ఆహ్వానితులేనని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ముసాపేటలోని ఫినాకిల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, మెట్రో పిల్లర్ నంబర్ 898, హనుమాన్ టెంపుల్ దగ్గర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 98481 99744 నంబర్ సంప్రదించాలని సూచించారు.


మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

# ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలి : ఆర్డీఓ

మునగాల, డిసెంబర్ 14 : ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరవేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి అధికారులు సూచించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, మీ సేవ కార్యాలయాలను అధికారులు గురువారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలో మీ సేవ కేంద్రాన్ని ఆర్డీఓ సూర్యనారాయణ తనిఖీ చేశారు. అలాగే రేపాల గ్రామంలో గల నర్సరీని జడ్పీ సీఈఓ సురేశ్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, తాసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ రాధారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

చండూరు, డిసెంబర్ 14 : ఈ నెల 18న చేపట్టనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో వెంటనే ప్రవేశ పెట్టాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈనెల 18,19 తేదీల్లో చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఇరిగి గురునాథ్, తలారి పరమేశ్, బొడ్డు యాదయ్య, మాదిగ సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు కరుణశ్రీ రవీందర్, తలారి శ్రీకాంత్, సాగర్ కొమ్ము గణేశ్, దాసరి రవితేజ పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా పరమాత్మ


పరమాత్మకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న హరిచందన

నీలగిరి, డిసెంబర్ 14: రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా నల్లగొండ జిల్లాకు చెందిన చిలుకూరి పరమాత్మ ఎన్నికయ్యారు. నవంబర్‌లో ఫార్మసీ ఫ్యానల్ కమిటీకి ఆరుగురు సభ్యులకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 81మంది పోటీ చేశారు. అందులో పరమాత్మ బలపర్చిన ఫ్యానల్ సభ్యులు భారీ మెజార్టీతో గెలుపొందారు. దాంతో గురువారం ఎన్నికల సంఘం అధికారి ఆయూష్ డైరెక్టర్ హరిచందన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర ఫార్మసీని ఏర్పాటు చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అంతేగాకుండా డాక్టర్ల చేతి గొలుసుకట్టు రాతలకు వ్యతిరేకంగా పోరాడి అక్షరాలను విడిగా రాసేలా సుప్రీంకోర్టు చేత తీర్పు చెప్పించడంలో కీలక భూమిక పోషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బలపర్చిన ఫ్యానల్‌ను గెలిపించిన ఫార్మసిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు తేజ విద్యార్థులు


మెరిట్ సర్టిఫికెట్స్ అందిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

కోదాడ రూరల్, డిసెంబర్ 14 : రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు తేజ విద్యాలయ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉస్తేల రమాదేవి తెలిపారు. గురువారం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థులు గౌతం, కృష్ణారెడ్డి, మాడుగుల వివేక్ ఉత్తమ ప్రతిభ చూపినట్లు చెప్పారు. వారు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను విద్యాలయ కరస్పాండెంట్ సోమిరెడ్డి, ఉపాధ్యాయలు అభినందించారు.

## మూడో రోజు పోస్టల్ సిబ్బంది సమ్మె


మునుగోడులో సమ్మె చేస్తున్న ఉద్యోగులు

మునుగోడు, డిసెంబర్ 14 : తమ డిమాండ్లను నెరవేర్చాలని పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మూడో రోజు కూడ కొనసాగింది. మండల కేంద్రంలో తపాలా కార్యాలయం ఎదుట పోస్టల్ సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమకు కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరసన కొనసాగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు శ్రీనివాస్, బి.నగేశ్, అరుణ, యాదగిరిస్వామి, దుర్గభవాని, బి.యాదయ్య, ఎస్.కే యూసఫ్, దివ్య, రాధ, గణేశ్, లావణ్య, సింధులహరి పాల్గొన్నారు.

## కోరుకొండ సైనిక పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నీలగిరి, డిసెంబర్14 : 2024–25 విద్యా సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాలలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 6వ తరగతిలో ప్రవేశానికి 10 నుంచి 12 ఏండ్ల వయస్సు కలిగి, 2024 మార్చి 31 వరకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 9వ తరగతిలో ప్రవేశానికి 13 నుంచి 15 ఏండ్ల వయస్సు కలిగి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. జనరల్, ఎక్స్ సర్వీస్ మన్, రక్షణ దళాల్లో పని చేసేవారి పిల్లలు, ఓబీసీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఫీజు రూ.650, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 500 ఉంటుందని తెలిపారు. https:// exa ms.nta.ac.in/AISSEE/ వెబ్ సైట్‌లో ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని, జనవరి 21న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## బంగారం చోరీ

కోదాడ రూరల్, డిసెంబర్ 14 : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటన కోదాడ పట్టణం సూర్యాపేట రోడ్డులో గురువారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట రోడ్డు కరూర్ వైశ్య బ్యాంక్ ఎదురుసందులో నివాసం ఉంటున్న ఇనకొల్లు అరుణ ఉదయం స్కూల్‌కు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. దాంతో బీరువాలో చూడగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీ.ఐ.టీ.రాము తెలిపారు. దుండగులు అదే ఇంట్లో కింది పోర్షన్‌లో ఉంటున్న రాజ్యం ఇంట్లోనూ చోరీకి యత్నించారు.